క్లుప్తంగా

వీ కేర్ మోసాలపై విచారణ జరపాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వీ కేర్ హెయిర్ అండ్ స్కిన్ సెంటర్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న మాట్లాడుతూ.. వీ కేర్ సెంటర్ నిర్వాహకులు వైద్యం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, వేలాది రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. వైద్యానికి ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు ఇప్పించి అప్పుల ఊబిలో నెడుతున్నారని మండిపడ్డారు. ఈ సంస్థపై సమగ్ర విచారణ జరిపించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు



బండిమెట్టలో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని 3వ వార్డు బండిమెట్టలో సచివాలయం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం బండిమెట్ట ప్రాంతంలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, నిరుపయోగంగా ఉన్న స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే భవనాలను నిర్మిస్తామన్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి దామోదర్, ట్రైనీ ఏఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందాలు

కర్నూలు: నాటుసారా తాగడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాల్లో చోటు చేసుకునే గొడవలు, కేసుల్లో ఇరుక్కుని పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులను వివరిస్తూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కళాబృందాలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో నవోదయం 2.0లో భాగంగా బంగారుపేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. నారాయణ కళా బృందంచే హరికథ, జానపద గీతాలు ఆలపిస్తూ ప్రజలకు సారా వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నాటకాలు ప్రదర్శించారు. ఏఈఎస్ రామచంద్రారెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు రెహనా, నవీన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెకు మద్దతు

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా మార్చి 24, 25 తేదీల్లో చేపట్టే బ్యాంకుల సమ్మెకు సీఐటీయూ, డీవైఎఫ్ఐలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, వై.నగేష్ తెలిపారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకుల బంద్ మద్దతు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని చేపట్టే బంద్‌కు కార్మిక సంఘంగా మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో బ్యాంకు ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. 2012- 13లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 8,01,509 కాగా, 2023-24లో ఆ సంఖ్య7,46,679కు తగ్గిపోయిందన్నారు. నాయకులు సాయిబాబా, నరసింహులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చిన్నారుల వికాసానికి కృషి చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు వారి కేంద్రాలకు వచ్చే చిన్నారుల వికాసానికి కృషి చేయాలని సి.బెళగల్ సెక్టార్ ఐసీడీఎస్ సూర్‌వైజర్ మల్లేశ్వరి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ బీ, పడాయి బీ కార్యక్రమ అమలులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. శుక్రవారం శిక్షణలో ఐసీడీఎస్ సూర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల పోషణ, వికాసానికి దోహదపడేలా టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారుల వికాసం, సంరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా శనివారం ముగుస్తుందని ఆమె తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో పురోగతి ఏదీ?

- గడువు 10 రోజులు - వసూళ్లు రూ.3.43 కోట్లు
- పన్నులు చెల్లించకుంటే అనుమతులు రద్దు
- అడిషనల్ కమిషనర్ హెచ్చరిక



పన్ను వసూలు చేస్తున్న సచివాలయాల ఉద్యోగులు

కర్నూలు (టౌన్): 'నగరపాలక సంస్థ పరిధిలోని 25వ వార్డు దేవనగర్‌లో ఓ లాడ్జి నిర్వాహకులు ఏడేళ్లుగా ట్రేడ్ లైసెన్సులు చెల్లించడం లేదు. రూ.3.31 లక్షల పన్ను బకాయిలు ఉన్నాయి. ఏడేళ్లుగా పన్ను చెల్లించకుంటే అక్కడున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీ, సచివాలయాల ఉద్యోగులు ఏం చేస్తున్నారు? పారిశుద్ధ్య విభాగం పనితీరుకు ఇది నిదర్శనం.

⇨ మరో 10 రోజుల వ్యవధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఇప్పటికే కర్నూలు నగర పాలక సంస్థలో పన్ను వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేశారు. ఇంటి, నీటి పన్నులు, ట్రేడ్ (వ్యాపార) లైసెన్సులు, అడ్వర్టైజ్‌మెంట్ పన్నులను నగరపాలక సిబ్బంది వసూలు చేస్తోంది. ఉదయం 6.30 గంటల నుంచి 52 వార్డుల్లో వసూళ్ల ప్రక్రియ కొనసాగుతుంది. 136 సచివాలయాల ఉద్యోగులు సైతం పన్నులను వసూలు చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో ఆస్తి పన్నుల రూపంలో రూ.94.73 కోట్లు, నీటి పన్నుల రూపంలో రూ.10.42 కోట్లు వసూలు చేశారు. అయితే ట్రేడ్ లైసెన్సుల విషయంలో మాత్రం పారిశుద్ధ్య విభాగం, సచివాలయాల ఉద్యోగులు చతికిలపడ్డారు. వేలల్లో ఉన్న ట్రేడ్ లైసెన్సులకు పన్నులు వసూలు చేయడంలో విఫలం చెందారన్న విమర్శలు ఉన్నాయి.

17 డివిజన్లు- డిమాండ్ రూ.4.51 కోట్లు

నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో వ్యాపారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సులు పొందాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది నగర పాలక సంస్థకు పన్నులు చెల్లించాలి. అలాగే రెన్యూవల్ చేయించుకోవాలి. పారిశుద్ధ్య విభాగం, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల సిబ్బంది పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. నగరంలో 17 శానిటేషన్ డివిజన్లు ఉన్నాయి. మొత్తం ఈ డివిజన్లలో ట్రేడ్ లైసెన్సులు 11,222 ఉన్నాయి. వీటి నుంచి రూ.4.51 కోట్లు వసూలు కావాల్సి ఉంది. పారదర్శకంగా తనిఖీ చేస్తే లైసెన్సుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. కొంతమంది వ్యాపారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, సచివాలయాల సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందుతున్నారు.ట్రేడ్ లైసెన్సుల సంఖ్య పెరగడం లేదు. ఆదాయంలో పెద్దగా మార్పు లేదు.

నగరపాలక ఆదాయానికి గండి

ఒక్క కొత్త బస్టాండ్ ప్రాంగణం, చుట్టూ 60కి పైగా షాపులు ఉన్నాయి. సముదాయాల్లో అడ్డగోలుగా షాపులు నడిపిస్తున్నారు. వీరంతా విధిగా పన్నులు చెల్లించాలి. అయితే నగరపాలక శానిటేషన్ విభాగం అవినీతి కారణంగా నగదు సొంత జేబుల్లోకి వెళుతుందన్న విమర్శలున్నాయి. సి.క్యాంపు సెంటర్, మద్దూరు నగర్, బిర్లా కాంపౌండ్ కాంప్లెక్స్‌లలో షాపులకు ట్రేడ్‌లు సక్రమంగా లేవు. దీంతో నగరపాలక సంస్థకు ఆదాయం గండి పడుతోంది. పారిశుద్ధ్య విభాగంలో ట్రేడ్ లైసెన్సుల కోసం సంప్రదిస్తే రూ.10 వేలు ఇస్తే కానీ లైసెన్సు మంజూరు కావడం లేదని వాపోతున్నారు. ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన అసెస్‌మెంట్లు మొత్తం 11,222 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా నగర పాలక సంస్థకు రూ.4.51 కోట్ల ఆదాయం వస్తుంది. మార్చి నెలాఖరు లోపు ఈ మొత్తం వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూ.1.08 కోట్లు మాత్రమే ట్రేడ్ లైసెన్సుల రూపంలో వసూలు చేశారు. మరో 10 రోజుల వ్యవధిలో ఆర్థిక సంవత్సరం గడువు ముగుస్తుంది. ఇంకా రూ.3.43 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. రోజు వారీ కలెక్షన్లు అంటూ అధికార యంత్రాగం వెంట పడుతున్నా ఆశించిన మేర బకాయిలు వసూలు కావడం లేదు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే ట్రేడ్ లైసెన్సుల సంఖ్య పెరగడంతో పాటు అనధికారికంగా వసూలు చేస్తున్న బాగోతం వెలుగులోకి వస్తుంది.

అనుమతులు రద్దు చేస్తాం



ఈ నెలాఖరు లోపు ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్సులను చెల్లించాలి. సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్సులు, టార్గెట్ ఇచ్చాం. షాపుల వద్ద బ్యానర్ ప్రదర్శిస్తూ శాంతియుతంగా పన్నులు చెల్లించాలని కోరుతున్నాం. ఇప్పటికీ ట్రేడ్ లైసెన్సుల వసూళ్ల ఆశించినంతగా లేవు. రోజువారీ వసూళ్ల వివరాలు సేకరిస్తున్నాం. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న ఐదుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. వ్యాపారాలు చేసుకుంటూ ట్రేడ్ లైసెన్సులు చెల్లించకుంటే లైసెన్సులు రద్దు చేస్తాం.

– ఆర్‌జీవీ కృష్ణ, అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ

పోలీసు, అగ్నిమాపక శాఖలో పురస్కారాలు

కర్నూలు (టౌన్): పోలీసు, అగ్నిమాపక శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రభుత్వం ఉగాది ఉత్తమ పురస్కారాలు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి జీఓ నంబర్ 53 విడుదల చేస్తూ ప్రిన్సిపాల్ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. జి.హుస్సేన్ పీరా (అడిషనల్ ఎస్పీ)వి.నాగేంద్రరావు (2వ బెటాలియన్ కమాండెంట్), లక్ష్మీకాంత రెడ్డి (ఏఆర్ ఎస్ఐ హోంగార్డ్స్) లకు ఉత్తమ సేవా పథకం అలాగే కఠిన సేవా పతకం సీహెచ్.రామిరెడ్డి (హెచ్ సీ-1187, తలారి నాగన్న పీసీ - 548, నబీ రసూల్ పీసీ -997 2వ బెటాలియన్) సేవా పతకంకు సంబంధించి మహమ్మద్ హనీఫ్ (హెచ్‌సీ- 2568, హరిచంద్రుడు హెచ్‌సీ 465 (నాగలాపురం పీఎస్) ఎస్.శిఖామణి (పీసీ-1942, మూడవ పట్టణ పోలీసు స్టేషన్) పి.ఖలందర్ షా (పీసీ-2219, ట్రాఫిక్) సి.శ్రీనివాసరెడ్డి (ఏఆర్ ఎస్ఐ 692), చక్రపాణి (ఏఆర్ ఎస్ఐ-306), ప్రహ్లాదరావు (ఏఆర్ ఎస్ఐ-1044) సుందరయ్య (హెచ్‌సీ-1303), ఆదిత్య ప్రతాప్ (హెచ్‌సీ, సీఐడీ), సత్యం లీడింగ్ ఫైర్‌మెన్, ఏపీ పోలీసు సేవా పతకం కింద ఇబ్రహీం (హెచ్‌సీ-2342, విజిలెన్స్) ఎంపికయ్యారు. వీరందరికీ ఉగాది పండుగ పురస్కరించుకొని ప్రభుత్వం పురస్కారాలు అందించనుంది.

కమ్యూనిటీ హాల్, హాస్టల్ ఏర్పాటుకు చర్యలు



విరాళం అందిస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు సమీపంలో ఏపీ ఆదర్శ పాఠశాల పక్కన నిర్మిస్తున్న శ్రీ భీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఆలయ నిర్మాణానికి తమ వంతుగా కల్లూరు మండలం పందిపాడు గ్రామ కురువ సంఘం నేతలు భీష్ముడు, బీసన్న, పెద్ద మద్దిలేటి, రాముడు తదితరులు రూ.43,200 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. భీరప్ప స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్నామన్నారు. ఆలయాన్ని పూర్తిస్థాయిలో నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, నగర అధ్యక్షుడు తవుడు శ్రీనివాసులు, బీసీ తిరుపాలు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వెంటనే ఇవ్వాలి



మాట్లాడుతున్న కె.ప్రభాకర రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేలు సాయం వెంటనే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఏటా రూ.20 వేలు ఇస్తానని చెప్పి పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. మరోవైపు అన్ని పంటలకు మద్దతు ధర కోసం చలో ఢిల్లీకి వెళ్తున్న నాయకులను పంజాబ్, హర్యాణాలో పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. రైతుల శిబిరాలను కూల్చడం ఘోరమని మండిపడ్డారు. పంటలకు సమగ్ర బీమా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు మల్లయ్య, సూరి, వనజ, హనుమంతు, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌యూ భూములను కాపాడాలి




ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ భూములను కాపాడాలని, భూకబ్జాకోరులను శిక్షించాలని విశ్వవిద్యాలయం విద్యార్థులు, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ వద్ద విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నాగరాజు, రామకృష్ణ, శరత్, నాగార్జున, వర్సిటీ ఉద్యోగులు సుంకన్న, నాగరాజు, మాధవశేఖర్, వెంకట స్వామి మాట్లాడుతూ.. 1992లో రాష్ట ప్రభుత్వం ఆర్‌యూకు 262 ఎకరాలు కేటాయించిందన్నారు. గత పది సంవత్సరాల్లో వర్సిటీ అధికారుల అలసత్వంతో ప్రస్తుతం కేవలం 110 ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. పసుపుల రోడ్‌లోని సర్వే నంబర్ 9/3-1లో గల భూమిని కొందరు ప్లాట్లు వేసుకొని నిర్మాణాలు చేపట్టడం దారుణమన్నారు. దీనికి ఎన్‌ఓసీ ఇచ్చిన వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మౌలాలి, రాజు, సాగర్, శివ, దివాకర్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగి మృతిపై వివాదం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో క్షయ (టీబీ) రోగి మృతి పట్ల శుక్రవారం వివాదం చెలరేగింది. కర్నూలుకు చెందిన నారాయణమ్మ (45) కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి ముదిరడంతో పది రోజుల క్రితం ఆసుపత్రిలోని టీబీసీడీ విభాగంలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో క్యాజువాలిటీకి తీసుకొచ్చి వైద్యం చేయగా ఆమె కోలుకోలేక మృతి చెందింది. నారాయణమ్మ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యులు అక్కడున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైద్యులు సర్దిచెప్పడంతో వారు మృతదేహాన్ని తీసుకొని వెళ్లిపోయారు.

ఆరోగ్య శాఖలో పదోన్నతులు కల్పించాలి



ఆర్‌డీ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో కేడర్ల మధ్య ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాయలసీమ జిల్లాల నాయకులు శుక్రవారం కడపలో ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) డాక్టర్ బి.రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదోన్నతులు ఆలస్యం అవుతున్నాయని, అన్ని కేడర్ల సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేసి అభ్యంతరాలను తెలియజేసే అవకాశం ఇవ్వాలని, అందుకు ముందస్తు జాబితాలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘాలతో సమావేశం నిర్వహించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ బాలకృష్ణ, రాయలసీమ జిల్లాల నాయకులు లక్ష్మినారాయణ, ఎంసీ నరసింహులు, సంపత్‌కుమార్, షేక్‌బాబా సాహెబ్, వై.శ్రీనివాసులురెడ్డి, బాషా, వీరేంద్ర, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసయాదవ్, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు నాయక్ ఉన్నారు.

డౌన్ సిండ్రోమ్ జన్యు సంబంధ వ్యాధి



చిన్నారులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): డౌన్ సిండ్రోమ్ ఒక విధమైన జన్యు సంబంధమైన వ్యాధి అని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి, ఐఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ విజయానందబాబు చెప్పారు. ఈ వ్యాధిగ్రస్తులలో క్రోమోజోములు 21లో రెండు ఉండాల్సిన పోగులు మూడు ఉంటాయన్నారు. దీంతో పిల్లల్లో భౌతిక పెరుగుదల మందగిస్తుందని, వీరి ముఖంలోని మార్పుల ఆధారంగా గుర్తించవచ్చన్నారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో చిన్నారులకు ఆటల పోటీలు, డ్రాయింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 830 పిల్లల్లో ఒకరు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మన దేశంలో ప్రతి సంవత్సరం 1.3 లక్షల మంది పిల్లలపై ఈ సమస్య ప్రభావం చూపుతోందని చెప్పారు. 35 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న స్త్రీలు ఇలాంటి పిల్లలకు జన్మనిచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఐఏపీ సెక్రటరీ డాక్టర్ వి.వీరరత్నాకర్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, డైస్ ఆఫీసర్ డాక్టర్ సృజన పాల్గొన్నారు.

నేడు న్యాయవాద సంఘం వార్షికోత్సవం

కర్నూలు: కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవి కాంత్‌ప్రసాద్ తెలిపారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ హాజరవుతారని వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది అధ్యక్షతన ఇన్‌చార్జ్ న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి న్యాయాధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు జరిగే న్యాయవాద సంఘం వార్షికోత్సవానికి నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు భవనాన్ని విద్యుత్ బల్బులతో అలంకరించారు.

న్యాయవాద ఎన్నికల అధికారులు నియామకం

ఈనెల 27న జరగనున్న కర్నూలు జిల్లా న్యాయవాద సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలకు నలుగురు న్యాయవాదులను ఎన్నికల అధికారులుగా నియమించారు. సీనియర్ న్యాయవాదులు విజయ్‌కుమార్, మోహన్‌బాబు, రంగనాథ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. ఈనెల 24న నామినేషన్లు, 25న ఉపసంహరణ, 27వ తేదీ పోలింగ్ నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీలోకి విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలని ఏపీ ఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, గౌరవాధ్యక్షుడు ఎండీ అంజిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆర్టీసీ ప్రైవేటీకరణపై ముద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీకి ప్రైవేటీకరణ విధానాలు మంచివి కావన్నారు. ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను తీసుకురావడం మంచిది కాదన్నారు. ఆర్టీసీ వర్కర్లు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం మార్చి 24వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


12న వీర హనుమాన్ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఓల్డ్‌సిటీలోని మేదరి వీధి శ్రీ అంబా భవాని దేవాలయంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బలోపాసన దివస్ పురస్కరించుకొని హిందువులను సంఘటితం చేసేందుకు శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు సిరిగిరి సపోము, హిందూ సంఘాల నాయకులు గంగాధర్, సునీల్, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఎస్‌యూ డైరీ విడుదల

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం (ఏఈఎస్‌యూ) - 2025 డైరీని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత విడుదల చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డితో కలసి డైరీని ఆవిష్కరించారు. ఆ సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్ రావు, కార్యదర్శి ఎం.పి. కాశన్న తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించండి



ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో వీధి కుక్కల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం 23వ వార్డు శ్రీరామనగర్‌లో సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయినా తరలించకుండా మునిసిపల్ కార్పొరేషన్ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. కర్నూలు నగరం చెత్తమయంగా మారిందని, మరోవైపు ప్రజల నుంచి పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్నా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీన మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు వెల్లడించారు.

ఒంటిపూట బడులా..? మాకు వర్తించవులెండీ..!



నారాయణ స్కూల్‌లో తరగతులకు హాజరైన విద్యార్థులు

కర్నూలు సిటీ: వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ ఈ నెల 15వ తేదీ నుంచి అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే కర్నూలు నగరంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు మాత్రం వాటిని పాటించడం లేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఆయా స్కూళ్లను సందర్శించి యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఇళ్లకు పంపించారు. నగరంలో నారాయణ స్కూల్‌కు చెందిన ఓ బ్రాంచ్‌లో విద్యార్థులతో మాట్లాడగా వారికి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, సాయి ఉదయ్ మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళిత నేతల గృహ నిర్బంధం అన్యాయం



మాట్లాడుతున్న యాట ఓబులేసు

కర్నూలు(అర్బన్): తిరుపతిలో జరగనున్న రాయలసీమ మాలల సింహగర్జన సభను దృష్టిలో ఉంచుకొని పోలీసులు దళిత నాయకులపై నిఘా పెట్టి గృహ నిర్బంధం చేయడం అన్యాయమని మాల జేఏసీ రాయలసీమ నేత యాట ఓబులేసు అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. ఈ సభ వెనుక వైఎస్సార్‌సీపీ ప్రోత్సాహం ఉందనే ఆరోపణలతో మాల జేఏసీ అధ్యక్షుడు యామల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, ప్రచార కార్యదర్శి ఆర్‌ఏ అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ధనశేఖర్, సహాయ కార్యదర్శి పాలకొర చిరంజీవిని గృహ నిర్బంధం చేశారని మండిపడ్డారు. ఈ సభ ఆరంభం మాత్రమేనని ఎవరు అడ్డుపడినా మాలల పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వం ఈ సభను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. క్రిమిలేయర్ వర్గీకరణ, వన్‌మెన్ కమిషన్, రాష్ట్ర కేబినెట్, అసెంబ్లీ తీర్మానాలను రద్దు చేసి ఎస్సీ రిజర్వేషన్లను జనాభా నిష్పత్తి ప్రకారం పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొని 15 నుంచి 20 శాతానికి పెంచాలన్నారు. నాయకులు సూర్య, అనిల్‌రాజు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల పూర్తికి చర్యలు

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): మార్చిలోపు మినీ గోకులాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వివరించారు. శుక్రవారం విజయవాడ కార్యాలయం నుంచి ఫారంపాండ్, సీసీ రోడ్ల నిర్మాణాలు, గోకులాల పురోగతిపై డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో 1200 గోకులాలకుగాను 664 పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్న వాటిని 15 రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి 119.70 కిలోమీటర్లకుగాను 116.72 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండడంతో కలెక్టర్‌ను డిప్యూటీ సీఎం అభినందించారు. ఇప్పటికీ రోడ్లు లేని గ్రామాలు 21 ఉన్నాయని, వాటిలో రూ.17 కోట్లతో 11 గ్రామాల్లో పనులను మొదలు పెట్టినట్లు చెప్పారు. మిగతా 10 గ్రామాల్లోనూ రోడ్ల పనులను ఏప్రిల్ నాటికి మొదలు పెడతామన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖకుమార్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పప్పూరి రామాచార్యులకు నివాళి

కర్నూలు సిటీ: రాయలసీమకు నీళ్లు, నిధులు నియామకాలు కావాలని పోరాటం చేసిన పప్పూరి రామాచార్యులు 53వ వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని అశోక కోచింగ్ సెంటర్‌లో శుక్రవారం రాయలసీమ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట అధ్యక్షుడు రవికుమార్, విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు సీమ కృష్ణ, యువ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రంగముని, బంజార గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు చంద్ర నాయక్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీభాగ్ ఒప్పందం సృష్టికర్త, పినాకిని పత్రిక వ్యవస్థాపకుల్లో రామాచార్యులు ఒకరని, ఆ తరువాత శ్రీసాధన పత్రికను స్థాపించి రాయలసీమ సమస్యలను దేశానికి తెలియజేశారన్నారు. సహాయ నిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుడుగా పేరొందారన్నారు. ఆయా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.